RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు


www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 252 పేజీలు - 08 శుక్రవారం 07 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

**అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం**

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 6:** తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మిగతా2లో...

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

**● నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక ● రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు ● బొగ్గు రాకపై డిప్యూటి సిఎం భట్టి ఆనందం**



**తొలి అక్షరం/మంచిర్యాల,ఆగస్టు 6:** సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా2లో...



## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిగతా2లో...

## కృష్ణా నీటి వాటాలను తేల్చంది

**తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 6:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించే దుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ, మిగతా2లో...




- బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఏపి

## అగ్ని-4 పరీక్ష విజయవంతం

**తొలి అక్షరం/భువనేశ్వర్,ఆగస్టు 6:** భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో మిగతా2లో...



## విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు
- ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**తొలి అక్షరం/ముంబై,ఆగస్టు 6:** కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి మిగతా2లో...



## బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

- రూ.23,731 కోట్ల 'గోబర్ధన్ పథకం
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 6:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ. 23,731 కోట్ల ' మిగతా2లో...

## తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

**● కెసిఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు**

**● జయంతి సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 6 :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత, కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు.దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో మిగతా2లో...

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

**- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**



**తొలి అక్షరం/ఖమ్మం,ఆగస్టు 6:** ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు నిర్ణీత ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పథకం ద్వారా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ. 4,016 లభిస్తోంది. అంతేకాకుండా ÷ల్ల÷లేరియా బాధితులకు కూడా ప్రతి నెలా రూ. 2,016 ఆర్థిక సాయం అందుతోంది. సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' ద్వారా లబ్ధిదారులకు డిజిటల్ మ్యాప్‌తో సహా భూమి హక్కు పత్రాలు అందజేసే బాధ్యతను మిగతా2లో...




## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**- అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**



## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 6:** ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ మిగతా2లో...

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ–10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

(మొదటి పేజీ తరువాయి)

నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెళి కదా..చెప్పి వస్తనన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నడు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

# బస్తీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ

**బీసీలను మభ్యపెడుతున్న కాంగ్రెస్, బీజేపీ**

**బీసీ బిల్లుకు చట్టబద్ధత వచ్చే వరకు**

**పల్లె నుంచి ఢిల్లీ దాకా పోరాటం:**

**టీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత**

**తొలి అక్షరం/దిల్‌సుఖ్‌నగర్,ఆగస్టు 6:** సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ బస్తీల్లో కుస్తీ.. ఢిల్లీ గల్లీల్లో దోస్తీ చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. బీసీ రిజర్వేషన్లపై క్రెడిట్ కొడదామనుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ద్వారా పార్లమెంట్‌లో చట్టం చేయించొచ్చుని, అలా చేయకుండా బీసీలను మభ్యపెడుతున్నారని అన్నారు.

తెలంగాణలో బీసీల జనాభా 60 శాతానికి పైగా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికే పరిమితం చేయడం ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా అన్ని పార్టీల అగ్రవర్ణ నాయకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఉన్నట్టే బీసీలకు కూడా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్టబద్ధత వచ్చే వరకు తెలంగాణ రక్షణ సేన పల్లె నుంచి పట్టణం దాకా, హైదరాబాద్ గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరుబాట పడుతుందని స్పష్టం చేశారు.సామాజిక తెలంగాణ కోసం రాజకీయాలకతీతంగా బీసీలకు బేషరతుగా అందరూ మద్దతు తెలపాలన్నారు. సామాజిక ఉద్యమాలకు నాంది పలికిన సాహుల్ మహారాజు, సిద్ధార్థుడు, మహాత్మ జ్యోతిబా పూలే, అంబేద్కర్ తదితరుల ఆశయాల సాధన కోసం టీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. అగ్ర కులాలే కాదు అణగారిన తరగతుల్లోనూ అధిక సంపన్నులు ఉన్నారని, అయితే అటువంటి వారితో ఆయా తరగతులకు కూడా న్యాయం జరగడం లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో కొంతమంది సంపన్నులున్నా 90 శాతం మంది పేదరికం అనుభవిస్తున్నారని తెలిపారు. మైనారిటీలు, క్రైస్తవులకు హక్కులు, సంక్షేమం కోసం పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

(మొదటి పేజీ తరువాయి)

ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరపున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**- అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 6:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు.

ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది.

'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతు న్నారని ఆరోపించారు.

యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయిం చుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# కృష్ణా నీటి వాటాలను తేల్చంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# అగ్ని-4 పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని–4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.

# బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026–27 నుంచి 2035–36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ ప్రక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

# సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. అలాగే రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నాడు. అంతే కాకుండా.. రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేదల భరోసా కోసం నిరంతరం శ్రమిస్తుందని ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు




**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.

# ప్రతి రేషన్ కార్డుదారునికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నాం

### దేశంలోనే రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

### కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలో మూడు నెలల ఉచిత సన్న బియ్యం పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి




**తొలి అక్షరం/కూసుమంచి, ఆగస్టు 06:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతి లబ్ధిదారునికి ప్రతి నెల 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామం చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి రేషన్ కార్డుదారులకు మూడు నెలల ఉచిత సన్నబియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు భద్రత, భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మన ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ప్రతినెల 6 కేజీల సన్నబియాన్ని అందిస్తుందని తెలిపారు. దేశంలో రేషన్ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చాలా మంది వినియోగించకుండా అమ్మేయడం లేదా రీసైక్లింగ్ పేరుతో అక్రమాలకు గురికావడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం నాణ్యంగా ఉండటంతో ప్రజలు స్వయంగా వినియోగిస్తున్నారని, ఒక్క గింజ తక్కువ వచ్చినా డీలర్లను ప్రశ్నించే స్థాయికి ప్రజల్లో చైతన్యం వచ్చిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు మెరుగైన ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి చెప్పారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎంతో బాగుందని, గతంలో రేషన్ బియ్యాన్ని విక్రయించేవాళ్లమని, ఇప్పుడు మాత్రం కుటుంబ సభ్యులే వినియోగిస్తున్నామని, ఉచిత సన్నబియ్యం వల్ల తమ కుటుంబా లకు ఎంతో మేలు జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రేషన్ షాప్ డీలర్ వై. సైది రెడ్డి, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి చేయూత పిల్లల భవిష్యత్తుకు భరోసా

### ఆకలి ఉన్న కుటుంబానికి అందించే ప్రతి సహాయం... వారి జీవితంలో ఒక ఆశాకిరణం

### మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకుల పంపిణీ



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 7:** రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఉంద్రాతి వెంకన్న నాలుగు రోజుల క్రితం పాముకాటుకు గురై మృతి చెందడంతో, కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. "మనం తినే అన్నం ముద్దలో ఒక మెతుకు పేదవారికి సహాయం చేయాలి.. మూడు పొయ్యి రాళ్ల మీద నాలుగు మెతుకులు ఉడికించాలనే లక్ష్యంతో ఆకలి లేని సమాజం కోసం" అనే ఆశయంతో ఏర్పడిన మన ఆపద్బాంధవుల ఫౌండేషన్‌కు చెందిన వెయ్యి మంది సభ్యుల సహకారంతో ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మృతుడు ఉంద్రాతి వెంకన్న కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. నీలం శేఖర్ మాట్లాడుతూ, "ఆకలి ఉన్న కుటుంబానికి అందించే ప్రతి సహాయం.. వారి జీవితంలో ఒక ఆశాకిరణం అలాంటిది కుటుంబంలో కెపెద్దదిక్కును కోల్పోయి, ఎలాంటి జీవనాధారం లేక నిస్సహాయ స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబాలకు మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.30 లక్షల విలువైన సహాయాన్ని 1,500 కుటుంబాలకు వివిధ రూపాల్లో అందించినట్లు తెలిపారు. మునిపంపుల గ్రామానికి చెందిన ఉంద్రాతి వెంకన్న కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని, కుటుంబ పెద్దను కోల్పోవడంతో పని చేసే వారు లేక జీవనాధారం కష్టంగా మారిందని తెలిపారు. ఇంటి వసతులు, ఇతర కనీస అవసరాలు కూడా సరిగా లేని పరిస్థితిలో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చిన్న పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ఈ కుటుంబానికి మరింత సహాయం అవసరమని, మానవతా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయాన్ని అందించాలని నీలం శేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాదే చంద్రశేఖర్, వేముల సైదులు, ఈదులకంటి శివకుమార్, ఉంద్రాతి నరసింహా, మిత్రులు కానుకుంట్ల ఉపేందర్, గౌస్, వనం నరేష్, మోహన్, ముత్యాలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం...

### 32 నెలల్లో రూ.21.61 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం

### అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

### రైతుల సంక్షేమానికి పెద్దపీట.. రూ.21 వేల కోట్ల రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్

### ఏదులాపురం, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి





**తొలి అక్షరం /ఏదులాపురం/ఖమ్మం రూరల్, ఆగస్టు 06:** పేదల సంక్షేమంతో పాటు గ్రామాలు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గుదిమల్లలో రూ.5 కోట్లతో ఖమ్మం రూరల్ మండలం ప్రకాష్ నగర్ బ్రిడ్జి నుంచి గుదిమల్ల వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు, 2 కోట్ల 10 లక్షలతో కామంచికల్ గ్రామం నుంచి కోయచలక వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని డివిజన్లు 8, 10, 11, 12 పరిధిలో రూ.21.61 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలు, కొత్త మున్సిపాలిటీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి, ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పేదలకు సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, తమ ప్రభుత్వం కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందన్నారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండవ విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మూడవ, నాలుగవ విడతల్లో కూడా మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా క్రింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర కూడా అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి కొత్తగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లు కూడా మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వమిదని, భవిష్యత్తులో కూడా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ఈ గ్రామానికి మరో రెండు రహదారులను మంజూరు చేస్తామని, మరో రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడతామని పేర్కొన్నారు. నిజంగా అర్హులైన పేదలే ఇందిరమ్మ ఇళ్లను పొందాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కామంచికల్ గ్రామం నుంచి కోయచిలక వరకు రూ.2.10 కోట్ల వ్యయంతో 1.6 కిలోమీటర్ల బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గత 32 నెలల్లో కామంచికల్ గ్రామ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.5.66 కోట్ల నిధులను మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఏదులాపురంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామంచికల్ కు గతంలో వచ్చినప్పుడు సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించామని తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు నేడు శంకుస్థాపన చేసిన పనులను కూడా నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ గత 25 సంవత్సరాల్లో జరగని రహదారి అభివృద్ధి పనులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో జరుగుతున్నాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.75 కోట్లు మంజూరు చేశారని, ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..! పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- వలిగొండ రోడ్డులో దారుణ దుస్థితి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్
- సుంకరి జంగయ్య గౌడ్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు చౌటుప్పల్ మున్సిపాలిటీ



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగస్టు 6:** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో ప్రతిరోజూ వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగింది. ఈ సమస్యపై స్థానిక ప్రజలు పలుమార్లు మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే వలిగొండ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నేలపట్ల ఎస్సీ బాలుర హాస్టల్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్







**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 6:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'హాస్టల్ నిద్ర' కార్యక్రమంలో భాగంగా గురువారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ స్పెషల్ ఆఫీసర్‌గా సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హాస్టల్ వార్డెన్ నాగ సైదులుకు సూచించారు. అనంతరం ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరానికి అందిస్తున్న నోట్‌బుక్స్, ప్లేట్లు, గ్లాసులను విద్యార్థులకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వసతి, సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యలో ప్రతిభ కనబరచాలని సూచించారు.

## తంగడిపల్లిలో ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలు

- ముటుకులోజు దయాకర్ చారి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌటుప్పల్ మున్సిపాలిటీ



**తొలి అక్షరం/చౌటుప్పల్:ఆగస్టు 6:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ముటకులోజు దయాకరాచారి ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను, ఉద్యమానికి అందించిన స్ఫూర్తిని నాయకులు కొనియాడారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ టీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్, 4వ వార్డు కౌన్సిలర్ ఉదరి యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిరా రాజరత్నం, మాజీ ఉపసర్పంచ్ అరిగే కిష్టయ్య, వార్డు సభ్యులు బొడ్డు ముత్యం, ఉదరి శ్యామ్ సుందర్, 6వ వార్డు అధ్యక్షుడు రావుల ముత్యాలు, 15వ వార్డు అధ్యక్షుడు ఉదయ్ కిషోర్, 5వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎండి అస్లం, మహిళా సంఘాల నాయకురాలు దేశగోని బేబీ, నిమ్మల అచ్చయ్య, బొంగు స్వామి, రాగిరు సత్యనారాయణ, అరిగే బీరయ్య, పరిపూర్ణ, కొయ్యడ లింగస్వామి, జిట్టా కృష్ణ యాదవ్, ఉబ్బు నరసింహ, ఉదరి మహేష్, ఉదరి సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ**

**భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి రైతుకు పట్టాదారు పాస్‌బుక్ అందిస్తాం**

**కూసుమంచి మండలంలో పర్యటించి**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**చేసిన మంత్రి పొంగులేటి**





**తొలి అక్షరం /కూసుమంచి, ఆగస్టు 06:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.రాజుపేట బజార్ గ్రామం వద్ద ఈశ్వర మాదారం నుండి భద్రు తండా వరకు రూ.1.76 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఈశ్వరమాదారం-భద్రు తండా రోడ్డు నుండి తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం చౌటుపల్లి గ్రామంలో రూ.3.20 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి లింగారం తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, ప్రజల ఆశీర్వాదంతో మంత్రిగా అవకాశం లభించిన అనంతరం గ్రామంలో మిగిలిన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లింగారం తండాలో రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. లింగారం తండాలో వీధి దీపాల ఏర్పాటును వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో అవసరమైన బీటీ రోడ్లు, త్రాగునీరు, ఇతర మౌళిక సదుపాయాలతో పాటు అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు అందించిందని, గత పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయ లేదని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రం లోనూ అమలు చేయని విధంగా తెలంగాణ లో రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం పేదలకు సొంత ఇళ్లు నిర్మించాలనే ఆలోచన కూడా చేయలేదని, తమ ప్రభుత్వం తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండవ విడతలో 2.5 లక్షల ఇండ్లు, హైదరాబాద్‌కు మరో లక్ష ఇండ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను కొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు.రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న మంత్రి, ఇటీవల రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను జమ చేశామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వరి కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలో ఉన్న భూ సమస్యలన్నింటినీ రాబోయే కొద్ది నెలల్లో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. పాలేరుప్రాంతంలో భూ రీ-సర్వే చేపట్టామని, పరిశీలించి అర్హులైన వారికి పట్టాదారు పాస్‌బుక్ లు అందిస్తామని చెప్పారు. నకిలీ పాస్ బుక్ లను రద్దు చేసి, సర్వే ఆధారంగా ప్రతి రైతుకు న్యాయబద్ధమైన భూమికి పాస్‌బుక్ అందజేస్తామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చే ప్రభుత్వంగా ముందుకు సాగుతామని, సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.అనంతరం లింగారం తండాలో రైతుతో కలిసి పొలంలోకి దిగి స్వయంగా ఎద్దుల అరకపట్టి దుక్కి దున్నారు. రైతులతో మమేకమై వ్యవసాయ పనులపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, డీవైఎస్‌వో సునీల్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, లింగారం తండా సర్పంచ్, ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో యువరైతు రేవనాల ఐలయ్య మృతి

**● శోకసంద్రంలో నీర్నంల దుబ్బాక గ్రామాలు**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 7:** రామన్నపేట మండలం, దుబ్బాక గ్రామానికి చెందిన రేవనాల ఐలయ్య (46) ఆకస్మికంగా అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటనకు సంబంధించి రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.మృతుడి భార్య రేవనాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 05-08-2026 తేదీన సాయంత్రం సుమారు 4:30 గంటలకు ఆమె తన భర్త రేవనాల ఐలయ్య కుమార్తె శివమణితో కలిసి దుబ్బాక రోడ్డులో ఉన్న తమ వ్యవసాయ పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు పూర్తి చేసి సాయంత్రం 5:00 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. అదే రోజు రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రకు సిద్ధమవుతున్న సమయంలో రేవనాల ఐలయ్య ఒక్కసారిగా నేలపై పడిపోయి, నోటి నుండి నురుగు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ఏరియా ఆసుపత్రికి రాత్రి 10:30 గంటలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు చికిత్స అందించినప్పటికీ, రాత్రి 11:00 గంటలకు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

## విప్లవ పోరాటపటిమలను రగిలించిన ధీరుడు గద్దర్

**తరతరాలకు తరగని విప్లవ పోరాటస్ఫూర్తి ప్రదాత గద్దర్ నౌక**

**గద్దర్ ఆశయాలను స్మరిస్తూ బెడా బుడగ జంగం సంఘం ఘన నివాళి**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** ప్రజల బాధలను తన పాటల్లో పలికించి, ఉద్యమాలకు ఊపిరి పోసిన ప్రజాకవి గద్దర్‌ను ఆయన వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్‌లో బుడగ జంగాల సంఘం నాయకులు ఘనంగా స్మరించుకున్నారు.షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి బేడా బుడగ జంగాల సంఘం మండల అధ్యక్షుడు, నాగులపల్లి వార్డు సభ్యుడు వానరాసి స్వామి నాయకత్వం వహించారు. జనచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లగల మల్లేష్ మాట్లాడుతూ, గద్దర్ పాటలు కేవలం వినోదం కోసం కాకుండా సామాజిక చైతన్యానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే శక్తిగా నిలిచాయని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు.జిల్లా అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, తాలూకా అధ్యక్షుడు వానరాసి యాదయ్య మాట్లాడుతూ.... సమాజంలో సమానత్వం, న్యాయం కోసం గద్దర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సదుల సత్యనారాయణ, ఫరూక్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి సదుల ఆనంద్, కోశాధికారి సదుల నందు, మొగుటం కుమార్, రాజు, నరసింహులు, నిరంజన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని గద్దర్ సేవలను స్మరించుకున్నారు.

## గోపాలపురం ప్రాథమిక పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.30 లక్షలు మంజూరు: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**విద్యార్థుల కోసం సొంత నిధులతో షెడ్ నిర్మించిన ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరాను అభినందించిన ముఖ్యమంత్రి**

**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**


**పాఠశాల పునరుద్ధరణ పనులకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు ఆదేశం**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 6:** తిరుమలాయపాలెం మండలం గోపాల పురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితిపై వచ్చిన వార్తకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించాలని ఆదేశించారని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.గురువారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోపాలపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాఠశాల భవనం, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గోపాలపురం ప్రాథమిక పాఠశాల భవనం కూలిపోయే పరిస్థితిలో ఉండటంతో గతంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం క్రింద ఎంపిక చేసి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టలేదని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరా తన సొంత నిధులు రూ.40 వేల వ్యయంతో తాత్కాలిక షెడ్ నిర్మించి తరగతులు నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. విద్యార్థుల పట్ల ఆమె చూపిన బాధ్యత, అంకితభావాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించిన సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరాను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవా దృక్పథం ఆదర్శప్రాయమని ప్రశంసించారు.గోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.30 లక్షలు మంజూరు చేశారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. పాఠశాల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఈ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నందున నాణ్యతతో, వేగవంతంగా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ విల్సన్ ఎంపీడీఓ సిలార్ సాహెబ్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఏఎంఓ., ఎంఈఓ., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులు పొందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

**● తిరుమలలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన జినుకల రమేష్.. ● రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**



**తొలిఅక్షరం/నర్సింహులపేట, ఆగస్టు 6:** నర్సింహులపేటమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, రైతులు, యువత, మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించారు.అనంతరం ఆలయ వేద పండితుల నుంచి వేద ఆశీర్వచనం స్వీకరించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు.ఈ సందర్భంగా జినుకల రమేష్ మాట్లాడుతూ, ప్రజాసేవను మరింత బాధ్యతాయుతంగా కొనసాగించేలా శ్రీవారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు




**తొలి అక్షరం/వలిగొండ ఆగస్టు 06:** వలిగొండ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని, పూలమాలతో సత్కరించారు, ఆయన చేసిన సేవలను, తెలంగాణకి కీరోలని, ఆయన తెలంగాణ స్ఫూర్తి ప్రదాత అని, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు, మాజీ జెడ్పీటీసి మోగుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పలుసం రమేష్, జానీ అప్రోచ్, చంద్రమౌళి, వార్డ్ మెంబర్ బల్గూరి నరేష్ రెడ్డి, డొప్ప బాలకృష్ణ ముదిరాజ్, భరణి నరేందర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ భావజాల వ్యాప్తికోసం జీవితాంతం కృషి చేసిన సిద్ధాంతకర్త,స్వయం పాలన స్వాప్నికుడు,ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా,తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషిని,త్యాగాలను,స్మరించుకుంటూ,వారికి ఘన



నివాళులు అర్పించారు.తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా,రాష్ట్ర సాధనకోసం తాను రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి ఒంటరి పోరాటం చేస్తున్న సందర్భంలో తన సలహాలు సూచనలతో జయశంకర్ సార్ కెసిఆర్ కు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.తన వ్యక్తిగత కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి,సైద్ధాంతిక నిబద్ధతతో రాష్ట్ర సాధనోద్యమం కోసం భావజాల వ్యాప్తి చేశారని ఈ సందర్భంగా కీర్తించారు.నాటి వారి 'అస్తిత్వ' ఆలోచనా విధానం తెలంగాణకు ఎల్లకాలం స్ఫూర్తిదాయకమేనని స్పష్టం చేశారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్ త్యాగాలను,కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో భూపాలపల్లి జిల్లాకు వారి పేరు పెట్టుకున్నామన్నారు.

# బాధిత కుటుంబానికి భరోసా

**• మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు, సేవా ట్రస్టు**



**తొలిఅక్షరం/నర్సింహులపేట ఆగస్టు 6:** మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల మల్లయ్య అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అన్నంగి నరేష్‌హరిచందన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.6,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు కలిసి కౌసల్యదేవిపల్లి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మరో రూ.1,500 అందించి కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని మల్లయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు... తరలిన బీసీల దండు

**ప్రత్యేక వాహనాలకు జెండా ఊపి ప్రారంభించిన వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్**

**మా వాటా మాకు దక్కేవరకు దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తాం**

**కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేస్తాం**

**బెంగళూరు సభ ద్వారా బీసీల ఐక్యత ను దేశవ్యాప్తంగా చాటి చెపుతాం...**

**బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ వెల్లడి**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బీసీల వాటా బీసీలకు దక్కేవరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేసి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తామని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి ప్రత్యేక వాహనాల ద్వారా హన్మకొండ హరిత హోటల్ నుండి బెంగళూరుకు బయలుదేరారు,బెంగళూరుకు వెళుతున్న ప్రత్యేక వాహనాలకు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వడ్ల కొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడు తూ... దేశంలో మండల కమిషన్ సిఫారసులను అమలు చేయాలని దశాబ్దాలుగా బీసీలు పోరాటం చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా అన్యాయమన్నారు మండల్ సిఫారసులను అమలు చేస్తున్నట్టు పార్లమెంటులో ప్రకటించిన ఆగస్టు 7న, ప్రతి సంవత్సరం దేశంలోని 29 రాష్ట్రాల బీసీలను ఏకం చేస్తూ జాతీయ ఓబీసీ మహాసభలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తూ వస్తున్నామని అందులో భాగంగానే ఈనెల 7న, బెంగళూరులోని సిటీ యూనివర్సిటీలో ఉన్న జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో జాతీయ ఓబీసీ 11వ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ మహాసభకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి 100 మంది, ఓబిసి ప్రతినిధులు తరలి వెళుతున్నట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్,బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి అరేగంటి నాగరాజు గౌడ్ బీసీ యువజన సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు గొట్టే మహేందర్,బీసీ సంఘం జిల్లా నాయకులు సంపత్,చంద్రశేఖర్,శ్రీకాంత్,అనిల్ యాదవ్,రవి,శనిగరపు సుమన్,మార్క అశోక్ గౌడ్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం.. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక డ్రైవ్

**- దోస్త్ ద్వారా ప్రత్యేక అడ్మిషన్లు.. ఆగస్టు 11 వరకు నమోదు**




**తొలి అక్షరం/షాద్‌నగర్, ఆగస్టు 06:** షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన డిగ్రీ సీట్ల భర్తీ కోసం దోస్త్ (DOST) ద్వారా ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల తెలిపారు. ఆగస్టు 6 నుంచి 11 వరకు దోస్త్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని కళాశాల ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. ఆగస్టు 14న సీట్ల కేటాయింపు జరగనుండగా, ఎంపికైన విద్యార్థులకు మొబైల్ ఫోన్‌కు సందేశం ద్వారా సమాచారం అందుతుంది. ఆగస్టు 14 నుంచి 18 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌తో పాటు కళాశాలలో కూడా రిపోర్ట్ చేయాలని తెలిపారు.బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఏ (తెలుగు, ఇంగ్లీష్ మీడియం), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌తో పాటు ఉద్యోగావకాశాలకు అనుగుణంగా రూపొందించిన బీఎస్సీ ఫార్మాస్యూటికల్ సైన్స్, బీకాం రిటైల్ ఆపరేషన్స్ (AEDP) కోర్సుల్లో ఇంకా కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశమని, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని సౌకర్యాలు, నాణ్యమైన అధ్యాపకులు ఉన్న షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని దోస్త్ కన్వీనర్ పాలాది శ్రీనివాసులు కోరారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్.రవి**

**ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి**

**చిత్రపటానికి పూలమాలలు వేసిన ఇన్చార్జి కలెక్టర్ రవి,డిఆర్వో శ్రీనివాస్, అధికారులు**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిదాయకం అని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్.రవి అన్నారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి,జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్,ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ...ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదారని,ప్రొఫెసర్ జయశంకర్ అధికారికంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.ఉద్యమాల వెనుక మేధావుల పాత్ర ప్రధానంగా ఉంటుందన్నారు.ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఎన్నో ఉద్యమాలలో ఉపాధ్యాయులు పాత్ర,సైద్ధాంతిక మార్గదర్శకం ద్వారా విజయవంతం అయ్యాయని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విలీనం అయిన తర్వాత తెలంగాణ ప్రాంత వెనుకబాటుతనాన్ని 1952లోనే గుర్తించి 1969 లో వచ్చిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో,మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆచార్య జయశంకర్ క్రియాశీలక పాత్రను పోషించారని అన్నారు.తెలంగాణ ఉద్యమానికి శ్వాసగా నిలిచి,తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు మనకెంతో స్ఫూర్తిదాయక మన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.తెలంగాణ అభివృద్ధి పథంలో ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం,తదితర అంశాల్లో మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు చేయూతనందిస్తూ ఆచార్య జయశంకర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని,రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్,జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు,వివిధ శాఖల అధికారులు,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.








# ఘనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహాన్ పుట్టిన రోజు వేడుకలు



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడియా తిరుమల చౌహాన్ పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించడం జరిగింది. పెద్దకోర్పోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్వకేట్ లావుడ్య తిరుమల్ చౌహాన్ జన్మదినం సందర్భంగా రెడ్లవాడ పిఎసిఎస్ చైర్మన్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , పెద్దకోర్పోల్ గ్రామ క్లస్టర్ ఇంచార్జి ఆవుల శ్రీనివాస్ సమక్షంలో పెద్దకోర్పోల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి,పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెండె రవీందర్,పడాల రాజ్ కుమార్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గాజుల రాము,6 వ వార్డు సభ్యులు పోరండ్ల రామ్ చందర్ మాజీ సర్పంచ్ మెండె కుమారస్వామి,మాజీ ఎంపీటీసీ జమండ్ల రాములు, ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు బిర్రు కమల్,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బూత్ ఇంచార్జి చెరుకు యాకాంత్, బాళ్ళే రవి అలకుంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, -బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్.



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావణ్య తిరుమల్ చౌహన్ పుట్టినరోజు వేడుకలను నెక్కొండ మండల వివిధ గ్రామాల సర్పంచ్ ల ఆధ్వర్యంలో నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు,బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి,కేక్ కట్ చేసి పుష్పగుచ్చం అందించి, నెక్కొండ మండల వివిధ గ్రామాల సర్పంచులతో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.



# ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి

**ఏకశిలా పార్కులో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్.రవి,జిడబ్ల్యుఎంసీ కమిషనర్ వెంకన్న**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతని గురువారం ఘనంగా నిర్వహించారు.హనుమకొండ ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) శేషాద్రి,హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్,తహసీల్దార్ రవీందర్ రెడ్డి,బల్దియా సి హెచ్ ఓ లాక్ష్మారెడ్డి,రెవెన్యూ మున్సిపల్,ఇతర శాఖల అధికారులు, వాకర్స్,తదితరులు పాల్గొన్నారు.




# గుర్రపు డెక్క ఆకులు తొలగించాలని బిజెపి డిమాండ్

**● అధికారులు స్పందించి సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకులను తొలగించాలని బిజెపి డిమాండ్...**



**తొలి అక్షరం/వలిగొండ ఆగస్టు 06:** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో వలిగొండ చెరువు నుండి కాలువల ద్వారా వెల్వర్తి తదితర గ్రామాలకు వెళ్లే సాగునీటి కాలువలు సందర్శించడం జరిగింది. వారు మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో గుర్రపు డెక్కహాకు పేర్కొపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కాకులను తీసివేయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి కాలువలు వద్దనే భారతీయ జనతా పార్టీ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, జిల్లా నాయకులు మైసొల్ల మచ్చగిరి, బచ్చు శ్రీనివాస్, ఆనంద్, మండల పదాధికారులు నాగరాజు, దయాకర్, వెంకటేశం నాయకులు పెద్ద కిట్టు, నరేష్, మురళి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి



**తొలి అక్షరం/వలిగొండ ఆగస్టు 06:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సీనియర్ నాయకులు చిలుగూరి సత్తిరెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, బొడిగెసుదర్శన్,కన్నె కంటి శ్రీనివాసచారి, ఐటి పాముల పుష్ప, కొండూరు సత్తయ్య, దండ మల్లికార్జున్, పల్లెర్ల రామచందర్, ఉక్కుర్తి యాదగిరి, పారుపల్లి నరసింహ, వనం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలు: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**తొలిఅక్షరం/మహబూబాబాద్ ఆగస్టు 6:** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ప్రత్యేక సిద్ధాంతకర్తగా మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు, భావజాలం నేటి యువతరానికి, రాబోయే తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని నాగలక్ష్మి, జిల్లా అధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, విజయ్ చంద్ర, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ రెడ్డి, మరియన్నా, జ్యోతి, విజయ నిర్మల, విజయ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ మరియు బిసి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్

**- రైతు వేదిక వద్ద జయంతి వేడుకలు**

**ఘన నివాళులర్పించిన సర్పంచ్ ఆర్. బాబు నాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని వెల్జర్ల గ్రామ రైతు వేదిక వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని జీవితాంతం వ్యాప్తి చేస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ఆచార్య జయశంకర్ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానంపేట్ సురేష్ గౌడ్, కొండన్నగూడ మాజీ సర్పంచ్ వై. శ్రీనివాస్ యాదవ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, జీపీవో విష్ణు, ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, యువ నాయకుడు జాంగారి రవి, ఉద్యమకారుల సంఘం నాయకుడు దొడ్డి రవీందర్, వార్డు సభ్యులు కావాలి లక్ష్మయ్య, తుప్పరి రమేష్, దొడల శేఖర్ యాదవ్, కావాలి కృష్ణకుమార్, సురేష్, మల్లేష్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**



**తొలిఅక్షరం/మహబూబాబాద్ ఆగస్టు 6:** ఆగస్టు 15వ తేదీన జరగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారిని, నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం, జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండా ను ఆవిష్కరించి ఘనంగా కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ, ప్రసంగం, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పై స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, సానిటేషన్, పిఎ సిస్టం, స్టేజ్ డెకరేషన్స్, చైర్స్, తదితర అన్ని సౌకర్యాలను సంబంధిత విభాగాల సిబ్బంది ఏర్పాట్లు చేయాలని తెలిపారు, ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం అందించాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా సాధించిన పురోగతి పై ప్రసంగం కాపీలను సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పవన్ కుమార్, సూపరింటెంట్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు

# రాష్ట్రాన్ని దోచిన కేసీఆర్ కాదు.. హృదయాలు దోచిన జయశంకర్ జాతిపిత..

**● పదవులు ఆశించేవాడు జాతిపిత ఎలా అవుతాడు..? ● రాష్ట్రాన్ని నిలువెల్లా దోచుకుంటే మహనీయులు అవుతారా..? ● కెసిఆర్ కుటుంబం పై ఎమ్మెల్యే శంకర్ ధ్వజం ● ఆచార్య జయశంకర్ జయంతి వేడుకల్లో "ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్".. ● షాద్‌నగర్ జేపీసీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు.**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** నిస్వార్థంగా ప్రజల కోసం పనులు చేసేవారు.. ప్రాణాలు సైతం ఇచ్చేవారు జాతిపితలవుతారు.. కానీ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయ పదవులు పొంది, కుటుంబాలకు కూడా పదవులు ఇచ్చినవారు జాతిపితలు ఎలా అవుతారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. తెలంగాణతో నిజమైన జాతిపిత రాష్ట్రాన్ని దోచుకున్న కెసిఆర్ కాదని, రాష్ట్రం కోసం నిస్వార్థంగా పనిచేసిన ఆచార్య జయశంకర్ మాత్రమేనని అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను పట్టణంలోని మండల పరిషత్ ముందు గల ఆయన విగ్రహం ముందు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ లాంటి నాయకులు కేవలం ప్రజల కోసమే పనిచేసి వారి ప్రాణాలను సైతం అర్పించాలని, వారు రాజకీయంగా ఎలాంటి పదవులు కూడా ఆశించలేదని గుర్తు చేశారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా ఎలాంటి పదవులు పొందకుండా ఆచార్య జయశంకర్ తన చివరి రోజు వరకు తెలంగాణ కోసం పోరాటం చేశారని అన్నారు. అలాంటి జయశంకర్ జాతిపిత అవుతాడు తప్ప ముఖ్యమంత్రి పదవులు చేపట్టి రాష్ట్రాన్ని నిలువెల్లా దోచుకొని, కుటుంబాలకు పదవులు ఇచ్చి వేల కోట్లు సంపాదించిన కేసీఆర్ జాతిపిత ఎలా అవుతాడని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టి ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో జయశంకర్ పోషించిన పాత్ర అత్యద్భుతమని అన్నారు. యువతను, విద్యార్థులను ఉద్యమం వైపు నడిపించడంలో జయశంకర్ సార్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. శ్రీకాంతాచారి లాంటివాళ్ళు ప్రాణాలు అర్పిస్తేనే తెలంగాణ వచ్చిందని, తెలంగాణ ఇవ్వాలమ్మ అంటూ వారు చనిపోయిన తీరును చూసి చెల్లించిన సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి రాష్ట్రానికి పదేళ్లపాటు పాలించి విచ్చలవిడిగా బీఆర్ఎస్ పార్టీలోకి పాల్పడిందని అన్నారు. ఆచార్య జయశంకర్ వల్లనే తెలంగాణ వచ్చినప్పటికీ కెసిఆర్ ఇది తన ఘనకారంగా చెప్పుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ నేతలు, జేపీసీ నాయకులు కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ ,కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్ రాజు నాయక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లమోనీ శ్రీధర్,నేతలు జమృత్ ఖాన్, ఇబ్రహీం,దంగు శ్రీనివాస్ యాదవ్ , సోలిపుర్ శ్రీశైలం గౌడ్, వావిలాల సుజివన్, ముబరక్, జమల్ పూర్ చందూలాల్,యువ నాయకులు జాంగారి రవి, గిరిజన నేత శ్రీను నాయక్, తుపాకుల శేఖర్,జాంగారి జంగయ్య, ఖదీర్, రవితేజ, యువ నాయకుడు గుట్ట రాజు, సీతారాం, విర్లా పల్లి అన్వర్,పద్మరం వెంకటేష్ యాదవ్ ,జేపీసీ నేతలు ఎం జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పి శెట్టి కర్ణకర్ నక్క బాలరాజు యాదవ్, రామ రావు, టెలిఫోన్ వెంకటయ్య, బాధే పల్లి సిద్దార్థ,నర్సింహులు, గొర్ల రాము,కృష్ణయ్య, రంగయ్య, కాషన్న , బాలరాజు, క్రాంతి కుమార్,కత్తి చంద్రశేఖర్ అప్పా, టి ఎన్ జీఓ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పోలే శ్రీహరీ,టిఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగాపగా జంగయ్య, రియల్ ఎస్టేట్ వ్యాపార అధ్యక్షుడు రాజు గౌడ్, ఉద్యమ కారులు దొడ్డి రవీందర్,మేకల వెంకటేష్ , రవి కుమార్ గౌడ్, సునీల్ రెడ్డి, అన్నారం బాలు నాయక్,గడ్డమిధీ రమేష్,గడ్డం జంగయ్య,యువసత్త అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, సిందం విటలయ్య, సునీల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఈ తరం కోసం ఎదురు చూపు

పాలిత వర్గం ప్రశ్నించనంత వరకే
పాలక వర్గానికి
జన నీరాజనం
నిర్మల నీటి నిశ్శబ్ద తరంగిణి
నిద్రాణంలో మునిగి ఉన్నంత వరకే
నదీ పరివాహక
ప్రాంత ప్రశాంతత
ప్రకృతి ప్రకోపం పెల్లుబిగిస్తే
ఉప్పెనై ఉరకలేసి
జీవ,వృక్షజాలాన్ని
సైతం కూకటి వేళ్లతో కూల్చేస్తుంది
తాలిమి ఉన్నంతవరకే
ఓరిమి పరిధి
జనగణం జంగుకై బాకాలూదినప్పుడే
రాజగణం జారుకునేది
జన సంద్రం మంద్రంగాఉన్నంతవరకే
పాలక ఆగడాలు అధికమించేవి
నిరసన స్వరాల
ఒరిపిడి లేనంతవరకే
నిప్పు రవ్వలు
నింగికి లేవనిది
రహస్య సంచారి
గాలి సోకనంతవరకే
ప్రళయాగ్ని అంటుకోనిది
నలుదిక్కుల
వాయు మండలం
గాలి జూలు జులూ పించనంత వరకే
అగ్ని భస్మ నిక్షిప్తమైన నిధిలా ఉండేది
కోపాగ్ని దావానలంగా
సంతరించుకుంటే
పాలక గుడారాలు పటాపంచలై
పంచభూతాల్లో
కలిసి పోవాల్సిందే
వంచన అంచున కుంచించుకుపోయిన
శాంతి కపోతాల విడుదల ఎప్పుడో
తరతరాల అభాగ్యుల
శిరః పంకిలాలను
కడిగి శీతలీకరించేదెవరో
దప్పికగొన్న జిహ్వల తడి నింపడానికి
నీటి దోసిల్లు పట్టే చేతులెవరివో
ఎండిన డొక్కల్లో
బుక్కెడు బువ్వ కుక్కి
కుక్షి బాధను తీర్చే మునివ్రేళ్లు ఎవరివో
శాంతి కాముక
సంక్షేమ ఫలాలను
నిష్పక్ష పాతంగా
పాలు పంచేదెవరో
వివక్ష లేని పేదల పక్షపాతి కోసం
లోకం ఎదురు చూస్తోంది
అందుకు సరైనదే
నేటి యువత వాకం,
తరం మారింది
స్వరం మారాలి
ఊతమిచ్చి ఉడుకు
రక్తం ఉద్యమిస్తే
ఊతకర్రలు ఇక
గద్దె దిగాల్సిందే,
నవతరం రావాల్సిందే
ఈ తరం పైననే
ఆశ, ఆకాంక్ష
ఈ మార్పు కోసమే
ఎదురు చూపులు..

**- పప్పుల,వెంకన్న**
**ఇనుగుర్తి**
**9347125338**



# అమ్మవారి కృపతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

**పుట్టొనిగూడ,కమ్మధానం గ్రామాలలో**

**బోనాల మహోత్సవం**

**పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్న**

**ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** షాద్ నగర్ నియోజకవర్గంలోని పుట్టొనిగూడ,కమ్మధానం గ్రామాలలో బోనాల మహోత్సవ కార్యక్రమాలలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ నగరాలు,గ్రామాలు అనే తేడా లేకుండా ప్రజలందరినీ ఒకేతాటిపైకి తెచ్చే భక్తి,ఐక్యత మరియు సామాజిక స్ఫూర్తి ఈ బోనాల పండుగలో కనిపిస్తుందని ఆయన స్పష్టం చేశారు.శ్రావణమాస ఉత్సవాల వేళ అమ్మవారి కృపతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ,ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్మదానం సర్పంచ్ లతా కిరణ్ కుమార్ గౌడ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచులు నర్సిములు,యారం శేఖర్ రెడ్డి,శేఖర్ పంతులు,శేరిగూడ ప్రశాంత్ రెడ్డి,జగన్ నాయక్,బీఆర్ఎస్ నాయకులు వార్డు సభ్యులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధనౌక గద్దర్, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

- టి.యు.జె.ఎ.సి ఆధ్వర్యంలో స్మారక కార్యక్రమం..
- వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కె. జయశంకర్ జయంతి, ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నివాళు లర్పించారు. షాద్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ (టి.యు.జె.ఎ.సి) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, తెలంగాణ ఉద్యమంలో వారు అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా టి.యు.జె.ఎ.సి అధ్యక్షుడు టి.జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను శాస్త్రీయంగా ప్రపంచానికి వివరించి ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, అర్జునప్ప, రవీంద్రనాథ్, తిరుమలయ్య, నందిగామ సురేష్, బుచ్చయ్య, క్రాంతికుమార్, బ్రహ్మచారి, గౌరీశ్వరి, నాగిళ్ల వెంకటేష్, నరసింహులు, ఎస్సార్ రామకృష్ణ, శంకర్ ముదిరాజ్, శివరాములు, వీరాచారి తదితరులు పాల్గొని జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో జయశంకర్ అందించిన సిద్ధాంత బలం, గద్దర్ కల్పించిన ప్రజా చైతన్యం ఎన్నటికీ మరువలేనివని, వారి ఆశయాల సాధనే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# ఆలోచించండి..ప్రాణాలకు ప్రమాదం కొనితెచ్చుకోవద్దు

**- డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడితే చర్యలు తప్పవు**

**- మల్కాజిగిరి కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు**

**- ఒక్క రోజే 813 కేసులు..**

**రూ.8.13 లక్షల జరిమానా**

**- హెచ్చరించిన ట్రాఫిక్ పోలీసులు**

Malkajgiri Commissionerate
Special Drive Cases on Cell phone Driving Dt: 06.08.2026.

| S.No | Police station | (Contact) | | (Non-Contact) | | Grand Total | |
|---|---|---|---|---|---|---|---|
| | | Cases | Amount | Cases | Amount | Total Cases | Total Amount |
| 1 | Malkajgiri Tr PS | 41 | 41000 | 22 | 22000 | 63 | 63000 |
| 2 | Gopalpuram Tr PS | 87 | 87000 | 14 | 14000 | 101 | 101000 |
| 3 | Jawaharnagar Tr PS | 27 | 27000 | 16 | 16000 | 43 | 43000 |
| 4 | Trimulgherry Tr PS | 11 | 11000 | 30 | 30000 | 41 | 41000 |
| 5 | Alwal Tr PS | 78 | 78000 | 15 | 15000 | 93 | 93000 |
| 6 | Begumpet Tr PS | 124 | 124000 | 111 | 111000 | 235 | 235000 |
| Zone- I | | 368 | 368000 | 208 | 208000 | 576 | 576000 |
| 1 | LB Nagar Tr PS | 26 | 26000 | 31 | 31000 | 57 | 57000 |
| 2 | Vanasthalipuram Tr PS | 50 | 50000 | 30 | 30000 | 80 | 80000 |
| 3 | Uppal Tr PS | 46 | 46000 | 13 | 13000 | 59 | 59000 |
| 4 | Kushaiguda Tr PS | 18 | 18000 | 13 | 13000 | 31 | 31000 |
| 5 | Ghatkesar Tr PS | 8 | 8000 | 2 | 2000 | 10 | 10000 |
| Zone- II | | 148 | 148000 | 89 | 89000 | 237 | 237000 |
| Total | | 516 | 516000 | 297 | 297000 | 813 | 813000 |

Section:
Cell Phone Driving (S 184)

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), ఆగస్టు6:** వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీ లభ్యాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డిసిపి–1 కె. రాహుల్ రెడ్డి (ఐపీఎస్), ట్రాఫిక్ డిసిపి–11 వి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది ఈ తనిఖీల్లో చురుగ్గా పాల్గొన్నారు. **813 కేసులు.. భారీగా జరిమానాలు:** ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన 813 మందిపై కేసులు నమోదు చేసి, రూ. 8,13,000 చలానాల జరిమానా విధించారు. ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాలు, సిగ్నల్ వ్యవస్థల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. వాహనం నడుపుతూ మాట్లాడటం, మెసేజ్‌లు పంపడం, బ్రౌజింగ్ చేయడం, వీడియోలు తీయడం మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించే వారిని ప్రత్యేకంగా గుర్తించి చర్యలు తీసుకున్నారు. **ఆలోచించండి.. ప్రాణాలకు ప్రమాదం కొనితెచ్చుకోవద్దు:** ఒక్క ఫోన్ కాల్ కోసం కాసేపు వేచి చూడవచ్చు..కానీ ఒక ప్రమాదం జీవితాన్ని శాశ్వతంగా మార్చేస్తుంది“ అని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ వాడకూడదని, అత్యవసరమైతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని నిలిపి మాట్లాడాలని సూచించారు.నిబంధనలు పదే పదే ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు.

# విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్ట్ 6:** విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో 25 మంది విద్యార్థులతో లిటిల్ ఫ్లవర్ సోల్జర్స్ టీమ్ ను ఏర్పాటు చేశారు.ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, వ్యాధుల సంక్రమణతో ప్రజలు ఇబ్బందులు పడ్డ తరుణంలో సోల్జర్స్ టీం ప్రజలకు అండగా నిలిచే సదుద్దేశంతో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, యాజమాన్యం విద్యార్థులతో సోల్జర్స్ టీమ్ ను ఏర్పాటు చేసింది.ముఖ్య అతిథిగా హాజరైన పాలకుర్తి ఎమ్మెల్యే సోల్జర్ టీమ్ తో ప్రమాణస్వీకారం చేయించి విపత్కర సమయాల్లో ఫోన్ చేయాల్సిన నంబర్ 9100100488 ను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు.విద్యార్థులు చదువుతోపాటు సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అవసరమని తెలిపారు.ఆ దిశగా పాఠశాలల యాజమాన్యాలు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. నేటి తరంలో మానవత్వ విలువలు తగ్గుతున్నాయని, సంతానానికి విద్యతోపాటు విలువలు, సేవా దృక్పథం అలవడేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.లిటిల్ ఫ్లవర్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను సోల్జర్స్ టీమ్ గా ఏర్పాటు చేసి వారికి శిక్షణ అందించడం గర్వకారణమని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం లో పాఠశాలల్లో సోల్జర్స్ టీమ్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, ఎస్సై తోట మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్,ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, వైద్యుడు డాక్టర్ అలువాల విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జాటోత్ హామ్యా నాయక్,మేకల కుమార్, గంజి విజయపాల్ రెడ్డి,మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, వికాస్,అభ్యాస్ పాఠశాలల కరస్పాండెంట్ లు తాళ్లపల్లి రమేష్, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు కీలక సూచన

- జిల్లా కోఆర్డినేటర్ జి. రవితేజ




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు06:** తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వివిధ రుణ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తు కాపీతో పాటు రూ.20 బాండ్ పేపర్‌పై న్యాయవాది ద్వారా రూపొందించిన సెల్ఫ్ డిక్లరేషన్‌ను సమర్పించాలని జిల్లా కోఆర్డినేటర్ జి. రవితేజ తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి రుణం పొందలేదని పేర్కొంటూ సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకురావాలని సూచించారు. రేపటి నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రెండు వెరిఫికేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.దరఖాస్తుదారులు తమ అప్లికేషన్ జిరాక్స్ కాపీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకువచ్చి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ నెల 15న రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నందున, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జి. రవితేజ విజ్ఞప్తి చేశారు.

# పెదగాని సోమక్కకి యతిరాజారావు పార్క్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఘన నివాళి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 6:** యతిరాజారావు పార్క్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, తొర్రూర్ మాజీ సర్పంచ్ పెదగాని సోమయ్య మాతృమూర్తి పెదగాని సోమక్క పరమపదించడం పట్ల అసోసియేషన్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం సోమక్క భౌతికకాయానికి యతిరాజారావు పార్క్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ఆత్మీయ సానుభూతిని తెలియజేశారు.ఈ నివాళి కార్యక్రమంలో పార్క్ అధ్యక్షులు కత్తి రవీందర్, సెక్రెటరీ ఎక్కటి నాగిరెడ్డి, ట్రెజరర్ మాదాసు రాములు, గౌరవ సలహాదారులు ఎమ్. బుచ్చయ్య, పేరటి యాకోబ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెరమాండ్ల రవి గౌడ్, సభ్యులు బాలాజీ, చీకటి వెంకన్న, సోమ రాములు, యాకుబ్ అలీ, శ్రీనివాస్, ఉపేందర్, వేణు, మహేష్, రమేష్, లక్ష్మి, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొర్రూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి స్మరణ సభ




**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 6:** తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు అధ్యక్షతన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి మరియు ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి స్మరణ సభ ఘనంగా నిర్వహించబడింది.కార్యక్రమంలో భాగంగా మొదటగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ భావజాల వ్యాప్తికి, స్వరాష్ట్ర కాంక్షకు దిశానిర్దేశం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని, తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో ప్రజా చైతన్యం నింపిన ప్రజా గాయకుడు గద్దర్ అని కొనియాడారు. విద్యార్థులు వీరి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.అనంతరం ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ వాల్య లూణావత్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన కృషిని, సిద్ధాంతకర్తగా మలిదశ ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తుచేసుకున్నారు. అలాగే సామాజిక న్యాయం కోసం గద్దర్ చేసిన సేవలను, ప్రజల కోసం ఆయన పడిన తపనను వివరిస్తూ ఈ తరానికి వారి పోరాట స్ఫూర్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, అంజుమ్ ఆరా, శాంతి కుమార్, పార్వతి, సుజాత, రజిత, దుర్గాభవానిలతో పాటు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చకచకా రాకా మూవీ షూటింగ్

## మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పడుకొణె

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నిటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నిటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷–లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.


-------------




# నవంబర్ 6న రామాయణ విడుదల

## అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండిగ్‌లో నిలిచింది.




## 'వారణాసి'కి తప్పని లీకుల బెడద..

# భారీ యాక్షన్ క్లిప్ లీక్!

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమాకు సంబంధించిన ఓ భారీ యాక్షన్ సన్నివేశం తాలూకు వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో లీకైంది. ఆగస్టు 8న మహేశ్ బాబు పుట్టినరోజుకు కొద్దిరోజుల ముందే ఈ వీడియో బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వారణాసి ఘాట్స్‌లో చిత్రీకరించిన ఈ సన్నివేశంలో మహేశ్ బాబు రక్తసిక్తమైన రూపంలో కనిపిస్తున్నారు. ఈ వీడియో ఫుటేజ్ చూసి అభిమానులు ఒకవైపు ఉత్సాహంతో ఊగిపోతూనే, మరోవైపు భద్రతా వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయితే, ఈ వీడియో క్లిప్ అసలైనదేనా? కాదా? అనే విషయంపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ప్రాజెక్టుకు లీకుల బెడద ఇదే మొదటిసారి కాదు. గతంలో సినిమా సెట్స్‌కు సంబంధించిన ఫొటోలు, కీలకపాత్రధారి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్, చివరికి అనౌన్స్‌మెంట్ మెటీరియల్‌కు సంబంధించిన భాగాలు కూడా అధికారిక ప్రకటనకు ముందే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. తాజా లీక్‌తో ఈ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. సెట్‌లో మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అభిమానులు కోరుతున్నారు.రాజమౌళితో మహేశ్ బాబు చేస్తున్న ఈ తొలి చిత్రం ఒక గ్లోబ్-ట్రాటింగ్ అడ్వెంచర్‌గా ఉండబోతోంది. ఇందులో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవిత్ర నగరం కాశీలో ప్రారంభమయ్యే ఈ కథ, టైమ్ ట్రావెల్ నేపథ్యంతో అంటార్కిటికా, ఆఫ్రికా, ప్రాచీన రోమ్ వంటి ప్రాంతాలకు సాగుతుందని రాజమౌళి గతంలోనే వెల్లడించారు.ఇప్పటికే సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయినట్లు సమాచారం. ప్రధాన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కూడా ముగిసింది. కీలక భాగాలను ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ, పోస్ట్-ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో జరుపుతూ, 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# గత సినిమాలతో గుణపాఠం నేర్చుకున్నా

## ప్రేక్షకులు ఆదరించే కథలకు ప్రాధాన్యం ఇస్తా: వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన వరుస ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన గత సినిమాల పరాజయాలపై వరుణ్ తేజ్ ఎంతో నిజాయితీగా స్పందించారు. 'మట్కా', 'ఆపరేషన్ వాలెంటైన్', 'గాండీవధారి అర్జున' వంటి చిత్రాలు ఎందుకు ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయాయో తనదైన విశ్లేషణ చేశారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'మట్కా' సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని వరుణ్ తెలిపారు. ట్రైలర్ విడుదలైన తర్వాత వచ్చిన స్పందన చూసి, తన నుంచి ప్రేక్షకులు అలాంటి సీరియస్ కథలను ఆశించడం లేదనే విషయం అర్థమైందన్నారు. సినిమాలోని కంటెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే స్థాయిలో లేకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణమని ఆయన అంగీకరించారు. రొటీన్‌కు భిన్నంగా కొత్త తరహా సినిమాలు చేయాలనే ఉద్దేశంతో 'మట్కా', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలు చేశానని వరుణ్ చెప్పారు. అయితే ఆ సినిమాలు కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే నచ్చాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయని వెల్లడించారు. ఒక సినిమా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ కలిసి చూసి ఎంజాయ్ చేయగలిగేలా ఉండాలి. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే ముందుగా వినోదాన్నే ఆశిస్తారు. ఆ బేసిక్ పాయింట్‌ను నేను మిస్ అయ్యాను అని వరుణ్ తేజ్ అన్నారు.

గత వైఫల్యాలు తనకు విలువైన పాఠాలు నేర్పాయని, ఇకపై వినోదానికి పెద్దపీట వేసే కథలను ఎంచుకుంటానని చెప్పారు. తన కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని వరుణ్ తేజ్ ధీమా వ్యక్తం చేశారు.





# కింగ్ జాకీ క్వీన్.. మూవీపై ఆసక్తికర అంశం

## అనుష్క కోసం 12 ఏళ్ల క్రితం రాసిన కథగా ప్రచారం

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ ' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ..

దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది.ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు.

# ది ప్యారడైజ్ టీజర్ రిలీజ్..

## ఊర మాస్ లుక్ లో విశ్వరూపం చూపించిన నాని!



నాచురల్ స్టార్ నాని, మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి కల్ట్ బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నుంచి తాజాగా అదిరిపోయే టీజర్ విడుదలైంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో నెవర్ బిఫోర్ లుక్‌తో విశ్వరూపం చూపించారు. ప్రచార చిత్రం చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద పెద్ద జాతరే జరగబోతోందని అర్థమవుతోంది... విడుదలైన టీజర్ మామూలుగా లేదు. 1980ల కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో, సమాజంలో అణచివేతకు గురైన వర్గం తమ ఉనికి కోసం చేసే పోరాటానికి నాయకుడిగా నాని కనిపిస్తున్నారు. "ఈ దేశం ఎవరిది? ఈ జాగా ఎవరిది?" అంటూ కత్తులు పట్టుకుని నాని అరిచే అరుపులు మాస్ ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ అని చెప్పాలి. ఇక కండలు తిరిగిన దేహంతో, జడల జుట్టుతో నాని ఇంటెన్స్ అవతార్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.టీజర్‌కి బిగ్గెస్ట్ హైలైట్ మాత్రం ఆ చివర్లో నాని చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్. "ఇరుగు దృష్టి, పొరుగు దృష్టి.. నల్లి గుట్లోన్ దృష్టి, బెదురు గుట్లోన్ దృష్టి..చెడు చూపులన్నీ పోవాలి అన్నీ దూరం కావాలిథూ థూ థూ!అంటూ నాని చెప్పిన తీరు థియేటర్స్ లో పూనకాలు పుట్టించేలా వుంది. ఇక ఆ కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గారి స్టైల్, డైలాగ్ చెప్తే ఎలాంటి బేస్ ఉంటుందో, సేమ్ అదే వైబ్‌తో నాని థియేటర్లలో దద్దరిల్లేలా చేశారు.